జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.
DASHANEWS
.COM
మంగళవారం
17 02 2026
సంపుటి 1 సంచిక 87
పేజీలు : 04
PRGI No :
TGTEL/25/A4195

దశ పత్రికలో పనిచేసేందుకు
జీహెచ్ఎంసీ పరిధిలో రిపోర్టర్లు
కావలెను. సీనియర్ రిపోర్టర్లకు
తగిన పారితోషికం
ఇవ్వబడును.
7337 54 6647
9848 28 8850



# నల్గొండ ఏకగ్రీవం

**మేయర్‌గా చైతన్య శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ మేయర్‌గా అష్రఫ్ అలీ ఎన్నిక**

## మూడేళ్ళ వరకు రాజకీయాలు మాట్లాడను..
## కార్పొరేటర్ లు ప్రజలకు సేవ చేయాలి: మంత్రి కోమటిరెడ్డి

**దశ, నల్గొండ**

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కు మేయర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం నగర అభివృద్ధికి మంచి సంకేతమని రాష్ట్ర రోడ్డు, భవనాలు సినిమాటోగ్రఫి శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం నల్గొండ నగర మేయర్ కార్యాలయ సమావేశ మందిరంలో నూతన నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అశ్రఫ్ అలీ అమీర్ల, కార్పొరేట్ల ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నల్గొండ కార్పొరేషన్ పరిధిలోని 48 మంది కార్పొరేటర్లకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అధికారంలో ఉన్నంత కాలం కార్పొరేటర్లు ప్రజలకు అంకితభావంతో సేవ చేయాలని మంత్రి సూచించారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా నేను అండగా ఉంటా. గెలిచిన వాళ్లు అందరు అభివృద్ధి కి పాటు పడాలి. మూడేళ్లలో నేషనల్ అవార్డు నల్గొండ కార్పొరేషన్ సాదించాలి. నగరంలో తాగునీటి వ్యవస్థ సరిగా లేదు.. వెంటనే నీటి సరఫరా మెరుగు పర్చాలని అన్నారు. ఏ సమస్య వచ్చినా ముందుగా మేయర్ దృష్టికి, అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం 5 వేల కోట్ల రూపాయల ఫ్రీ కరెంటు బిల్లు చెల్లించిందని, ఒక్కో కుటుంబానికి సుమారు 50 వేల రూపాయల వరకు కరెంటు బిల్లు భారం తగ్గించామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. గతంలో ఎంపీగా తనకు ఉన్న పరిచయాలతో ఢిల్లీ నుంచి నిధులు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. 700 కోట్ల రూపాయలతో బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధి ఇప్పుడు మీ చేతుల్లో ఉందని కార్పొరేటర్లకు స్పష్టం చేశారు. మేయర్‌తో సమన్వయం చేసుకుని నల్గొండ నగర అభివృద్ధికి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ విభేదాలు పక్కనపెట్టి అన్ని పార్టీల కార్పొరేటర్లు అభివృద్ధి కోసం ఏకమవ్వాలని సూచించారు.

మూడేళ్లపాటు రాజకీయాలకు దూరంగా ఉండి, పూర్తిగా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అన్నారు. తనకు పదవులు ముఖ్యమేమీ కావని, అభివృద్ధే ముఖ్యమని స్పష్టం చేశారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎంఐఎం ఎమ్మెల్సీ ఆఫన అలీ, గ్రంథాల సంస్థ చైర్మన్ ఆఫీస్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## భార్య, భర్తలే చైర్మన్, వైస్ చైర్మన్



**దశ, అదిలాబాద్:** నిర్మల్ మున్సిపాలిటీ రాజకీయ చరిత్రలోనే ఒక అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. నిర్మల్ ఛైర్ పర్సన్ గా అప్పాల కావ్య, వైస్ ఛైర్మన్ ఆమె భర్త అప్పాల గణేష్ చక్రవర్తి సోమవారం ప్రమాణం చేశారు. ఒకే కుటుంబానికి చెందిన భార్యా భర్తలు మున్సిపల్ కీలక పదవులను దక్కించుకోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ బలపరిచిన ఈ జంట ప్రమాణ స్వీకారం చేయడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో నెలకొన్న రాజకీయ ఉత్కంఠకు తెరపడింది.

## 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా

**దశ, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా పలు కారణాల వల్ల 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా పడింది. ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగాం, తొర్రూర్‌లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీలో ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తొర్రూరులో 16 వార్డులు ఉండగా బిఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7 గెలుచుకున్నాయి. దీంతో ఎక్స్ అఫీషియో ఓట్లు కీలకంగా మారాయి. ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎంపీ కడియం కావ్య, ఎంఎల్ఎ యశస్వినిరెడ్డి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఎక్స్‌అఫీషియో ఓట్లతో బలాబలాలు సమానమయ్యాయి. ఈ నేపథ్యంలో కావ్య ఓటుపై అభ్యంతరం చేస్తూ బిఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు.

**ఇబ్రహీంపట్నంలో రాజకీయ ఉద్రిక్తతలు**

## ఇబ్రహీంపట్నం చైర్మన్ ఎన్నికపై సస్పెన్స్

# నేడు మళ్లీ ఎన్నిక...





**దశ, రంగారెడ్డి :**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా మారింది. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి సరైన మెజార్టీ కౌన్సిలర్లు గెలుపొందినప్పటికీ, స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ఆనందం కోసం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని టీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆరోపణలు చేశారు. రంగారెడ్డి జిల్లా టీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, “మెజార్టీ ప్రజాభిప్రాయాన్ని గౌరవించకుండా రాజకీయ కుట్రలకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. ఎన్ని అడ్డంకులు సృష్టించినా చైర్మన్ పీఠాన్ని టీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ఘాటుగా హెచ్చరించారు. అదే విధంగా రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి స్పందిస్తూ, “దొంగలు దొంగ దొంగగా కలిసి ఓ కౌన్సిలర్ను కిడ్నాప్ చేసి నాటకం ఆడుతున్న ఘటనలను ప్రజలంతా గమనిస్తున్నారు. ఇప్పటికైనా సరైన పాఠం నేర్చుకోకపోతే ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారు,” అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్ వర్గాలు ఆరోపిస్తున్న దాని ప్రకారం, మెజార్టీని దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఒక కౌన్సిలర్‌ను అపహరించినట్టు సమాచారం. అయితే ఈ అంశంపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. రాజకీయ ఆరోపణలు, ప్రతిఆరోపణల మధ్య మున్సిపాలిటీలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి.

**చైర్మన్ ఎన్నిక రద్దు – ఆర్డీవో ప్రకటన.**

ఇదిలా ఉండగా, సోమవారం జరగాల్సిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు పలు కారణాల చేత రద్దు చేసినట్లు ఆర్డీవో అనంతరెడ్డి అధికారికంగా ప్రకటించారు. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, భద్రతా పరమైన మరియు పరిపాలనా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మంగళవారం చెర్మన్ ఎన్నిక ఉంటుందని స్పష్టం చేశారు.

మొత్తంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో రాజకీయ పరిణామాలు వేడెక్కుతున్నాయి. మెజార్టీ ఆధారంగా చైర్మన్ పీఠం దక్కించుకోవాలని టీఆర్ఎస్ పట్టుదలగా ఉండగా, ఎన్నికల ప్రక్రియ వాయిదా పడటంతో స్థానిక రాజకీయాలు మరింత రసవత్తరంగా మారాయి. కాగా నేను కేవలం ఎక్స్ ఆఫీసీయోమెంబెర్ గా నా ఓటు వినియోగించుకోవడానికి మాత్రమే మున్సిపల్ కు రావడం జరిగిందని, ఎన్నికల అధికారులు ఎలా చెప్తే అలాగే నడుచుకుంటానని స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు.

**అనుమతి లేకుండా సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదు: ఫ్యూచర్ సీటీ కమిషనర్ సుధీర్ బాబు.**

రాష్ట్ర ఎన్నికల సంఘం తాజా ఉత్తర్వుల ప్రకారం, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మరియు వైస్‌చైర్‌పర్సన్ పదవులకు నిర్వహించాల్సిన పరోక్ష ఎన్నికలను మంగళవారం నాడు నిర్వహించేందుకు రీషెడ్యూల్ ఖరారైంది.

16/02/2026 సాయంత్రం 5 గంటల నుండి 17/02/2026 రాత్రి 11 గంటల వరకు ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం చుట్టూ 500 మీటర్ల పరిధిలో 3 మందికి పైగా గుమికూడరాదు. అనుమతి లేకుండా సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ప్రజలు, రాజకీయ నాయకులు మరియు అభ్యర్థులు పోలీసులకు సహకరించాలని ఫ్యూచర్ సీటీ కమిషనర్ జీ సుధీర్ బాబు తెలిపారు.

## నేడు, రేపు బయో ఏషియా-2026 సదస్సు

**దశ, హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మకమైన 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సును ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో జరగబోయే బయోఏషియా2026 సదస్సు ఈ నెల 17, 18 తేదీల్లో రెండు రోజుల పాటు జరగనుంది. ఈ ప్రపంచ స్థాయి సదస్సు ప్రధానంగా ‘టెక్‌బయో అన్‌లీష్డ్ ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు’ ఇతివృత్తంగా నిర్వహిస్తున్నారు. టెక్‌బయో ఇన్నోవేషన్స్‌లో దేశం గ్లోబల్ హబ్‌గా మారుతున్న తరుణంలో, అధునాతన సాంకేతిక పరిజ్ఞాన వినియోగంతో లైఫ్ సైన్సెస్ రంగంలో భవిష్యత్తు ఆరోగ్య సంరక్షణ సంబంధించిన అంశాలపై ఈ సదస్సు చర్చించనుంది. లైఫ్ సైన్సెస్ రంగంలో ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏర్పాటు చేసే అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌ను సీఎం ప్రారంభిస్తారు. అనంతరం బయోఏషియా సదస్సును ప్రారంభించి ప్రసంగిస్తారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులో జాతీయ, అంతర్జాతీయ నిపుణులు, శాస్త్రవేత్తలు, బయో సైన్సెస్ రంగంలో నిష్ణాతులు ఆయా అంశాలపై ప్రసంగించనున్నారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో పాటు పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్ , అమెరికాకు చెందిన ఆమ్జెన్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ హోవర్డ్ వై చాంగ్ కీలకోపన్యాసం చేయనున్నారు. సైన్స్, సాఫ్ట్‌వేర్ అండ్ సప్లయ్, నెక్స్ట్ జనరేషన్ బయోలాజిక్స్, ఫార్మా, బయోటెక్ భవిష్యత్తు, ఏఐ, ఆర్ అండ్ డీ (డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్), గ్లోబల్ ఇంపాక్ట్, తెలంగాణ రైజింగ్ 2047 - వరల్డ్‌క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్ వంటి కీలక అంశాలపై జరిగే చర్చల్లో వివిధ దేశాల నుంచి హాజరైన ప్రతినిధులు పాల్గొంటారు.

## ప్రజా సేవ నుంచి ప్రైవేటు ఉద్యోగం వైపు జేడీ...

**దశ, హైదరాబాద్:** సీబీఐ మాజీ జేడీ వి.వి. లక్ష్మీనారాయణ.. తెలుగు రాష్ట్రాల్లో ఈ పేరు తెలియని వారుండరు. అవినీతి తిమింగలాల గుండెల్లో నిద్రపోయిన అధికారిగా, అచంచలమైన నిజాయితీకి మారుపేరుగా ఆయన నిలిచారు. అయితే, వ్యవస్థలోని లోపాలను సరిదిద్దేందుకు ఐపీఎస్ పదవిని వదిలి రాజకీయాల్లోకి వచ్చిన ఈ మిస్టర్ క్లీన్, ఇప్పుడు అనూహ్యంగా అన్నింటినీ వదిలేశారు. ప్రైవేటు కంపెనీలో ఉద్యోగంలో చేరిపోయారు. నిజానికి ఆయన అన్ని బాధ్యతలను పూర్తి చేసుకుని తన అభిరుచి మేరకు రాజకీయ, సేవా రంగంలోకి వచ్చారు. కానీ ఇప్పుడు ఎందుకు మళ్లీ ఉద్యోగ బాధ్యతల్లోకి వెళ్లారు?. ఇటీవల ఆయన కుటుంబం సైబర్ మోసగాళ్ల బారిన పడింది. రెండున్నర కోట్ల వరకూ నష్టపోయారు. తన సుదీర్ఘ సర్వీసులో కష్టపడి సంపాదించుకున్న డబ్బంతా ఒకే ఒక్క సైబర్ మోసంతో ఆవిరైపోవడం ఆయనను తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిందన్న అభిప్రాయం కనిపిస్తోంది. రాజకీయాల్లోకి రాకముందే తనదైన ముద్ర వేసిన లక్ష్మీనారాయణ, 2019 నుంచి ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉన్నారు.



## జెఇఇ మెయిన్స్ ఫలితాలు విడుదల

**దశ, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్, ఇతర కోర్సుల ఎంట్రెన్స్ కోసం విద్యార్థుల రాసే జెఇఇ మెయిన్స్ పరీక్షల ఫలితాలు వచ్చాయి. ఇందులో ముగ్గురు తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. ముగ్గురికి 100 పర్సెంటైల్ వచ్చింది. తెలంగాణ రాష్ట్ర విద్యార్థి వివన్ శరద్ మహేశ్వరికి, ఎపికి చెందిన ఇద్దరు విద్యార్థులు జి.నరేంద్ర బాబు, పసల మోహిత్‌కు 100 పర్సెంటైల్ వచ్చింది. ఒబిసి కేటగిరీలో నరేంద్రబాబు టాపర్‌గా నిలిచాడు. ఎస్సి కేటగిరీలో ఎపి విద్యార్థి దేవ శ్రీవేద్ టాపర్‌గా నిలిచాడు. ఈసారి 13.04 లక్షల మంది జెఇఇ మెయిన్స్ రాశారు.